

తెలంగాణ భవన్‌లో దీక్షాదివస్ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత మధుసూదనాచారి, చిత్రంలో కేటీఆర్, పొన్నాల లక్ష్మయ్య, కవిత, పద్మారావుగౌడ్, తలసాని, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, బండా ప్రకాశ్, మాగంటి గోపీనాథ్, గొంగిడి సునీత, దాసోజు శ్రవణ్, స్వామిగౌడ్, దేశపతి శ్రీనివాస్, ఎర్రోళ్ల శ్రీనివాస్



## కాంగ్రెస్ సర్కార్‌ది పదేండ్ల విధ్వంసం

### జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పది నెలల్లో పదేండ్ల విధ్వంసాన్ని సృష్టించిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని కేసీఆర్ తెలంగాణ సాధించారని పేర్కొన్నారు. లగచర్ల, దిలావర్పూర్ గిరిజనులు నడుంకట్టి పోరాటం చేస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేలుగా తామంతా ప్రత్యేక రాష్ట్రానికి అనుకూలంగా ఇచ్చిన లేఖలో సంతకం పెట్టకుండా తప్పించుకు తిరిగిన తెలంగాణ ద్రోహి రాష్ట్రానికి సీఎం కావడం దురదృష్టమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. 'కేసీఆర్ దీక్ష చేయకపోతే తెలంగాణ వచ్చేదా..? రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవాడా? అని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి బూడిద భిక్షమయ్యగౌడ్ ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. లగచర్ల, దిలావర్‌పూర్ ఘటనలు రేవంత్‌రెడ్డి సర్కారుకు చెంపపెట్టు లాంటివని పేర్కొన్నారు.

# తెలంగాణ రక్షకు తప్పదు మరో దీక్ష

**గుజరాత్ గులాములు ఓ పక్క.. ఢిల్లీ కీలుబొమ్మలు మరో పక్క • వీళ్లతో తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వానికి పొంచి ఉన్న ప్రమాదం**

**ఈ తరంలోనూ ఆత్మగౌరవ స్ఫూర్తి నింపాలె • తెలంగాణ గొంతు బీఆర్‌ఎస్ ఒక్కటే • లగచర్ల విజయం ప్రజలదే • దీక్షా దివస్‌లో మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్/కరీంనగర్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): 15 ఏండ్ల క్రితం కేసీఆర్ ఉక్కు సంకల్పంతో 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అంటూ జన సామాన్యులను తట్టి తన ప్రాణాన్ని పణంగా పెట్టి ఆమరణ దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించి పెట్టారని, పదేండ్లపాలనలో మహోన్నతంగా అభివృద్ధి చేసి చూపించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 11 నెలల పాలనలోనే రాష్ట్రానికి పూడ్చలేని నష్టం కలిగించిందని, నిన్నమొన్నటి దాకా అణగిమణగి ఉన్న కొన్ని శక్తులు కేసీఆర్ దిగిపోగానే రెచ్చిపోతున్నాయని, ఓవైపు గుజరాత్ గులాములు, మరోవైపు ఢిల్లీ కీలుబొమ్మలతో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదం పొంచి ఉన్నదని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల పరిరక్షణ కోసం మరోసారి దీక్ష చేయాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. ఈ దీక్షా దివస్ సందర్భంగా 14 ఏండ్ల పోరాట చరిత్రను మననం చేసుకొని ఈ తరంలోనూ ఆత్మగౌరవ స్ఫూర్తిని రగిలించాలని కోరారు. దీక్షా దివస్ సందర్భంగా శుక్రవారం తెలంగాణభవన్, కరీంనగర్ జిల్లా అల్గునూర్‌లో ఏర్పాటు చేసిన సభల్లో కేటీఆర్ ప్రసంగించారు. 33 జిల్లాల్లో దీక్షా దివస్‌ను పెద్ద ఎత్తున విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు బంజారా బిడ్డలు వచ్చారని, వారి కళారూపాలను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తే ఈ ప్రభుత్వం లేకిగా ప్రవర్తించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్ వద్ద లైట్లు బంద్‌జేసి, కరెంట్ తీసేసి, బీఆర్‌ఎస్ బ్యానర్లను చింపివేసి చాలా నీచంగా వ్యవహరించిందని మండిపడ్డారు.


దీక్షాదివస్ సందర్భంగా కరీంనగర్ అల్గునూర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్

### ఈ తరంలోనూ ఆత్మగౌరవ స్ఫూర్తి రగిలించాలి

'సమైక్యాంధ్ర సంచులు మోసిన తెలంగాణ ద్రోహి మన ముఖ్యమంత్రిగా ఉన్నడు.. తెలంగాణ ఉద్యమంపై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్ రెడ్డి.. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తానని రెచ్చిపోతున్నడు.. ఆయన చెరిపేయాలని చూస్తున్నది కేసీఆర్ ఆనవాళ్లను కాదు.. తెలంగాణ ఆనవాళ్లను! అందుకే తెలంగాణ రాజముద్రలో కాకతీయ కళాతోరణం.. చార్మినార్‌ను తొలిగించాలని దుర్మార్గమైన ఆలోచన చేసిండ్రు. తెలంగాణ తల్లి రూపాన్నే మార్చేస్తా అంటున్నడు.. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి స్థానాన్ని కబ్జాపెట్టి రాహుల్‌గాంధీ తండ్రి విగ్రహాన్ని పెట్టుకొని ఢిల్లీకి గులాంగిరీ చేస్తున్నడు' అంటూ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 'స్వీయ రాజకీయ అస్తిత్వం లేకపోతే ప్రస్తుత పార్లమెంట్‌లో మన గళం వినిపించేవాడే లేడు. తెలంగాణ ప్రయోజనాల కోసం పట్టుబట్టే వాడే లేడు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు అదానీలు, ప్రధానిలు ఇక్కడ అడుగు పెట్టే సాహసం చేయలేదు. కానీ ఇప్పుడు మళ్లీ తెలంగాణ మీద పట్టుకోసం వస్తున్నరు. ఇది మామూలుగా తీసుకోవాల్సిన విషయం కాదు. కవులు, కళాకారులు, మేధావులు తెలంగాణపై జరుగుతున్న దాడిని గుర్తించాలి. ఈ తరంలోనూ ఆత్మగౌరవ స్ఫూర్తిని రగిలించాలి' అని పిలుపునిచ్చారు.

### పండిన పంట ఎంత? ఇచ్చిన బోనస్ ఎంత?: కేటీఆర్

'రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే కేవలం 5,19,605 క్వింటాళ్ల వడ్లకు బోనస్ ఇచ్చారు..ఈ లెక్కలను చూస్తేనే సర్కారు చిత్తశుద్ధి తెలుస్తున్నది' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎకరానికి ఏడాదికి రూ.15 వేల చొప్పున రైతులకు రూ.1.5 కోట్ల ఎకరాలకు ఎగ్గొట్టిన రైతుభరోసా ఎంత? కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఎగ్గొట్టిన నగదు ఎంత? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇన్ని కోట్లు ఎగ్గొట్టి, ఇప్పటివరకు ధాన్యానికి ఇచ్చిన బోనస్ రూ.25.98 కోట్లేనని శుక్రవారం ఎక్స్ వేదికగా తూర్పారబట్టారు. 'కొన్నది పిసరంత..కోతలు కొండంత' అని ధ్వజమెత్తారు. పండుగలాంటి వ్యవసాయం కాంగ్రెస్ పాలనలో మళ్లీ దండుగలా మారిందని మండిపడ్డారు.

### గతం తెలియకుండా.. గమ్యం చేరలేం

చరిత్ర చదవకుండా భవిష్యత్తును నిర్మించలేమని, గతం తెలుసుకోకుండా గమ్యాన్ని నిర్ణయించుకోలేమని కేటీఆర్ చెప్పారు. 'ప్రతి జాతి తన వైభవాన్ని, పోరాటాలు, త్యాగాలు, విజయాలను, కథగానో, పాటగానో, ఏదో కళా రూపంలో నిత్యం గానంచేస్తూనే తర్వాతి తరాలకు అందిస్తూ ఉంటుంది. వీరులను, వీరగాథలను, వీరోచిత యుద్ధాలను నిత్యం స్మరించుకుంటూ ప్రతి దేశం, ప్రతి జాతి తన ఉనికి, అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఉడుకు నెత్తురుతో ఉన్న యువతకు పౌరుషాన్ని నూరిపోస్తూనే ఉంటుంది' అని గుర్తుచేశారు.

### నాడు ప్రజా ఉద్యమాన్ని అణచివేశారు..

'1948 నుంచి 1956 వరకు తెలంగాణ ప్రాంతం ప్రత్యేక రాష్ట్రంగా ఉండే. ఆనాటి హైదరాబాద్ ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా 1956లో ఆంధ్రాకు, తెలంగాణకు బలవంతపు పెళ్లి చేశారు. ఈ బంధం సరిగా లేకపోతే ఎప్పుడైతే అప్పుడు విడాకులు తీసుకోవచ్చని నాడు నెహ్రూ అన్నట్టుగానే జరిగింది. రాష్ట్రం మెదటి రోజు నుంచే కుట్రలు చేశారు. 1956 నుంచి 1969 వరకు తెలంగాణ లోలోపల ఉడికి పోయింది. 1969 నుంచి 1971 వరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. బలవంతపు పెళ్లి చేసిన ఇదే కాంగ్రెస్ పార్టీ మళ్లీ తెలంగాణ ఉద్యమాన్ని కర్కషంగా అణచివేసింది. ఇందిరాగాంధీ హయాంలో కూడా తెలంగాణ ప్రజలు 14 సీట్లకు గాను 11 సీట్లు తెలంగాణ ప్రజా సమితికి ఇచ్చి తెలంగాణ కోరిక ఎంత బలంగా ఉన్నదో చాటి చెప్పారు. కానీ, ప్రజా తీర్పుకు వ్యతిరేకంగా తెలంగాణ ఆకాంక్షను అదిమిపెట్టింది కాంగ్రెస్ పార్టీ. 1969 ఉద్యమంలో 369 మంది విద్యార్థులను పొట్టనబెట్టుకున్నది. తెలంగాణ నాయకులు పదవుల కోసం ఉద్యమాన్ని తాకట్టు పెడతారని ఉన్న అపవాదును కేసీఆర్ 2001లో పదవుల త్యాగంతో పార్టీని ప్రారంభించి పోగొట్టారు. రాష్ట్రాన్ని సాధించి మహోన్నతంగా అభివృద్ధి చేశారు' అని కేటీఆర్ గుర్తుచేశారు.

### తెలంగాణ భవన్.. జనతా గ్యారేజ్

'కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ భవన్ ఇప్పుడు జనతా గ్యారేజ్ అయ్యింది. మూసీ, హైడ్రా, లగచర్ల బాధితులు సాయం కోసం తెలంగాణ భవన్‌కు వస్తున్నరు. తెలంగాణ గొంతు అంటే బీఆర్‌ఎస్ మాత్రమే. మైనార్టీ సోదరులు కూడా మనవాళ్లు ఎవరో.. కానివాళ్లు ఎవరో గుర్తించాలి. తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడుతున్నది కేసీఆర్, బీఆర్‌ఎస్ మాత్రమే' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

### ప్రపంచానికే తెలంగాణ ఉద్యమ పాఠాలు

మన జాతికి మహత్తరమైన పోరాటాల చరిత్ర ఉన్నదని, ప్రపంచానికే పాఠాలు నేర్పిన ఉజ్వల ఉద్యమ గాథ మన సొంతమని కేటీఆర్ గుర్తుచేశారు. 'కుట్రలు, కుతంత్రాలను ఛేదించి, యావత్ జాతిని ఏకతాటిపై నడిపించి శాంతియుత పంథాలో వ్యూహాలు, ఎత్తుగడలు రచించి, ఉక్కు సంకల్పంతో, చెక్కు చెదరని నిబద్ధతతో గమ్యాన్ని ముద్దాడిన నాయకుడు మనకున్నాడు. భారత స్వతంత్ర సంగ్రామంలో దండియాత్ర, సహాయ నిరాకరణ, ఇంకెన్నో పోరాట ఘట్టాలు ఉన్నట్టే మలిదశ తెలంగాణ పోరాటంలో మహోజ్వల సందర్భాలు చాలా ఉన్నాయి. అట్లాంటి అద్భుత ఘట్టాల్లో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ఒక పతాక సన్నివేశం' అని కేటీఆర్ చెప్పారు.

> "ప్రతిజాతికి, ప్రతి దేశానికి, ప్రతి ప్రాంతానికో కథ ఉంటది. ఆ కథలో కథనాయకులు, ప్రతినాయకులు.. త్యాగాలు, విద్రోహాలు, విజయాలు.. గుణపాఠాలు ఉంటయి. తెలంగాణ కథలో కూడా కథానాయకుడు.. తెలంగాణ తల్లికి జన్మించిన తనయుడు కేసీఆర్.. అందుకే మన చరిత్రను రేపటి తరానికి, ఆ కథను గాథను నరనరాన ఎక్కించాలి. లేకపోతే ఆ జాతి మళ్లా పరాయి దండయాత్రలతో ఓడిపోయే ప్రమాదం ఉంటది.
> -కేటీఆర్

### రహదారిపై లైట్లు బంద్

**బసవతారకం** క్యాన్సర్ హాస్పిటల్ నుంచి తెలంగాణభవన్ వరకు సుమారు 200-300 మీటర్ల దూరం వరకు కేటీఆర్ ర్యాలీ ప్రారంభించబోతుండగా వీధి దీపాలు బంద్ అయ్యాయి. అంతా చీకటి అలుముకున్నది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాటుచేసిన బ్యానర్లు ధ్వంసమై, చిరిగిపోయి ఉన్నాయి. ఇదే విషయంపై దీక్షా దివస్ సభలో కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణభవన్ వద్ద లైట్లు బంద్‌జేసి, కరెంట్ తీసేసి, బీఆర్‌ఎస్ బ్యానర్లు చించివేసి ప్రభుత్వం నీచంగా వ్యవహరించిందని మండిపడ్డారు.

### చరిత్రను విస్మరిస్తే బానిస బతుకే..

ఏ జాతి అయితే తన చరిత్రను విస్మరిస్తుందో ఆ జాతి పరాయి పెత్తనంలో బానిసగా మగ్గిపోతుందని కేటీఆర్ హెచ్చరించారు. 'ఒక ప్రాంతాన్నో, దేశాన్నో ఓడించి వశం చేసుకున్న విజేతలు పరాజితుల చరిత్రను చెరిపేస్తారు. తెలంగాణ ఏర్పడితే ఇక్కడి నాయకత్వానికి పాలించే సత్తా లేదని మనపై దాడి జరిగింది. వాటిని పటాపంచలు చేస్తూ దేశం గర్వించేలా చేసిన చరిత్ర కేసీఆర్‌ది' అని గుర్తుచేశారు.

### ఒక్క పొరపాటుతో 60 ఏండ్లు గోసపడ్డం

ఒకసారి ఆదమరిచి, అప్రమత్తంగా లేకుండా ఒక పొరపాటు చేస్తే 60 ఏండ్లు తెలంగాణ అరిగోస పడ్డదని, మూడు తరాలు పీడనకు బలై పోవాల్సి వచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. 'అందుకే.. తెలంగాణ వచ్చింది కదా ఇంకెందుకు ఉద్యమయాది? మళ్లా ఎందుకు పోరాట చరిత్ర అనుకుంటే అది పెద్ద పొరపాటు అవుతుంది. ఒక తరానికి ఆత్మగౌరవ రణం నేర్పి కేసీఆర్ విముక్తి ఎట్లా సాధించాడో రేపటి తరానికి తెలియాలి. అందరికీ నిన్నటి పోరాటంలో హీరోలు ఎవరో, విలన్లు ఎవరో, శిఖండులు ఎవరో తెలిస్తేనే ఈ జనరేషన్ జాగ్రత్త నేర్చుకుంటది' అని చెప్పారు.

> "ఓ పక్క గుజరాత్ గులాములు.. మరో పక్క ఢిల్లీ కీలు బొమ్మలు నక్కి ఉన్నరు. వీళ్లతో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదం పొంచి ఉన్నది. నీళ్లు, నిధులు, నియమకాలు ఉద్యమ నినాదమే కాదని నీల్గుతున్నరు. అదానీ, ప్రధాని తొక్కుకుంటూ వస్తున్నరు.. వారిని ఎదిరించేందుకు భాస్వరమై మండాలె.. ఆత్మగౌరవం ప్రమాదంలో పడుతున్నప్పుడు తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయకుంటే తప్పు చేసినవాళ్లమవుతం.
> -కేటీఆర్

### తెలంగాణ అస్తిత్వంపై దాడి మొదలైంది

సోనియమ్మ లేకుంటే తెలంగాణ అడుక్కు తినేదని సీఎం రేవంత్‌రెడ్డి అహంకారంతో అడ్డగోలుగా వాగుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రజాపోరాటాన్ని, అమరవీరులను కించపర్చుతున్నారని మండిపడ్డారు. 'ఒక గుజరాతీ వచ్చి విడిపించాడు. ఇంకో గుజరాతీ వచ్చి అభివృద్ధి నేర్పిస్తున్నాడని బీజేపీ నేతలు అంటున్నారు. ఇలాంటి వాళ్లతో తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం పొంచి ఉన్నది. ఈ సమయంలో తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయకుంటే తప్పు చేసినవాళ్లమవుతం' అని హెచ్చరించారు.

### కేసీఆర్ అంటే హిమాలయ శిఖరం

తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ ఒక హిమాలయ శిఖరంలా నిలిచి పోతారని, ఆయన చరిత్రను చెరిపేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోడని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసీఆర్ అనేది పేరు కాదని, అది తెలంగాణ పోరు అని స్పష్టం చేశారు. తెలంగాణ కోసం ఆయన పలికిన ప్రతి మాట ఒక తూటాలా పేలిందని, ప్రజలను ఒక రాజకీయ శక్తిగా మలిచి ఉద్యమాన్ని నడిపించిందని గుర్తుచేశారు. అల్గునూర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్టు తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిందని తెలిపారు. కేసీఆర్‌తోపాటు నాయిని నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ లాంటి పలువురు ప్రముఖులు అరెస్టయినపుడు రాష్ట్రమంతా భగ్గున మండిందని చెప్పారు. శ్రీకాంతాచారి, పోలీసు కిష్టయ్యలాంటి వాళ్లు ఎందరో తమ ప్రాణాలను అర్పించారని, ఈ దుర్ఘటనలు చూసి కేసీఆర్ తమ ముందే బోరున విలపించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోవడంవల్ల ఇషాంత్‌రెడ్డి, సిరిపురం యాదయ్య, వేణుగోపాల్‌రెడ్డి ఇలా వందల మంది పిల్లలు ఆత్మ బలిదానాలు చేసుకున్న పరిస్థితి ఆనాటిదని చెప్పారు.

### మరోసారి పోరుబాట తప్పదు

బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, తెలంగాణ వాదులు మరోసారి పోరుబాట పట్టాల్సిన అవసరం ఉన్నదని కేటీఆర్ స్పష్టంచేశారు. ఏ క్రూరమైన కాంగ్రెస్ దశాబ్దాల పాలన మనతో ఆడుకున్నదో, మన జీవితాలను చెల్లాచెదురు చేసిందో, మళ్లీ అదే దుర్మార్గులు మోసపూరిత హామీలిచ్చి ఓట్లు వేయించుకుని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. కేసీఆర్ పోరాట స్ఫూర్తి, దీక్షా దివస్ స్ఫూర్తితో మరోసారి కదంతొక్కుదామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేదాకా ప్రజల పక్షాన కలిసికట్టుగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

### ఇది తెలంగాణ ప్రజల విజయం

'కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో మహిళలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆనాడు బ్రిటిషర్లు చేసిన దానికన్నా అరాచకాన్ని సాగించింది. బందిపోట్ల మాదిరిగా పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారు. మన పోరాటానికి తలొగ్గిన ప్రభుత్వం లగచర్లలో భూముల సేకరణను విరమించుకున్నది. ఇది బీఆర్‌ఎస్ విజయం. తెలంగాణ ప్రజల విజయం. గిరిజనులు, దళితులు, బీసీలు, రైతుల విజయం. ఈ రియల్ ఎస్టేట్ బేహారికి పాలన తెలియదు. మీ భూములు తీసుకొని రియల్ ఎస్టేట్ దందా చేయటం మాత్రమే తెలుసు. మరో రూపంలో మీ భూములు కావాలని మళ్లీ వస్తడు. జాగ్రత్తగా ఉండాలే' అని కేటీఆర్ చెప్పారు

### ఉప్పు సత్యాగ్రహం తరహాలో ఆమరణ దీక్ష: సిరికొండ

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహం ఎంత కీలకంగా మారిందో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష అంత కీలకంగా మారిందని శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి చెప్పారు. తెలంగాణ భవన్‌లోలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రాణత్యాగానికి తెగించి చేపట్టిన ఆమరణ దీక్షకు తెలంగాణ ప్రజలు నీరాజనం పట్టారని గుర్తుచేశారు. జైత్రయాత్రో? చావుయాత్రో?నని తెగించి ఉద్యమించి కేసీఆర్ స్వరాష్ట్రాన్ని సాధించిపెట్టారని చెప్పారు. నాడు బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్, టీడీపీ పొత్తు పెట్టుకొని గెలిచి మోసం చేశాయని మండిపడ్డారు.

### కేసీఆర్ అరెస్టుతో స్ఫూర్తి పొందా: మాజీ మంత్రి గంగుల

తాను 2009లో కరీంనగర్ ఎమ్మెల్యేగా ఉన్నానని, అప్పుడు వేరే పార్టీలో గెలిచానని, నాడు కేసీఆర్ అరెస్టుతో తాను ఎంతో స్ఫూర్తి పొందానని మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కేసీఆర్ హైదరాబాద్ నుంచి కరీంనగర్ వస్తున్నపుడు కార్యకర్తలు సైనికుల్లా కాపలా ఉండేవారని, వారిని దాటి కేసీఆర్ వద్దకు వెళ్లాలంటే పోలీసులకు సాధ్యం కాకపోయేదని, అలాంటి కేసీఆర్‌ను 2009 నవంబర్ 29న మోసం చేసి అల్గునూర్ చౌరస్తాలో పోలీసులు అరెస్టు చేశారని గుర్తుచేశారు. అల్గునూర్ సభలో గంగుల మాట్లాడుతూ కేసీఆర్‌ను అరెస్టు చేసిన రోజు రాయలసీమ, ఆంధ్రా నుంచి వేలాది మంది పోలీసులను రప్పించారని చెప్పారు. నాడు కేసీఆర్ దీక్ష చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదని, ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోతుందని స్పష్టంచేశారు.

### చరిత్రలో నిలిచేలా అభివృద్ధి: మండలి వైస్ చైర్మన్ ప్రకాశ్

కేసీఆర్ పోరాటం, రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేసిన అభివృద్ధి చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోతుందని మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ పేర్కొన్నారు. తాను రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తరుచూ కేసీఆర్ గురించే మాట్లాడేవారని, తెలంగాణలో అభివృద్ధిని అభినందించేవారని గుర్తుచేశారు. ఐక్యరాజ్య సమితి కూడా కేసీఆర్ చేసిన అభివృద్ధిని అభినందించిందన్నారు.



దీక్షాదివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, పద్మారావుగౌడ్, తలసాని, బండా ప్రకాశ్, పొన్నాల లక్ష్మయ్య, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, స్వామిగౌడ్, గొంగిడి సునీత, కవిత, దాసోజు శ్రవణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్

## ఘనంగా దీక్షా దివస్

**రాష్ట్రవ్యాప్తంగా** శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. కరీంనగర్ జిల్లా అల్గునూర్, హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కార్యక్రమాలకు కేటీఆర్ హాజరయ్యారు. అల్గునూర్ వెళ్తుండగా ఎల్ఎండీ కాలనీ వద్ద అమరుల స్థూపం వద్ద కేటీఆర్ నివాళులర్పించారు. అక్కడి నుంచి భారీ బైక్ ర్యాలీ ద్వారా ఓపెన్ టాప్ కారులో అల్గునూర్ వచ్చిన కేటీఆర్, చౌరస్తాలో కేసీఆర్‌ను అరెస్టు చేసిన చోట ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సాయంత్రం ఐదు గంటలకు కేటీఆర్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ నుంచి భారీ ర్యాలీగా తెలంగాణభవన్‌కు చేరుకున్నారు. అక్కడ ముందుగా కేటీఆర్, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మ ధుసూదనాచారి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. సభా వేదికపై ఏర్పాటుచేసిన అమరవీరుల స్తూపానికి పూలుజల్లి నివాళులర్పించారు. 2009లో కేసీఆర్ ఆమరణ దీక్ష జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రెండు చోట్లా కేటీఆర్ ప్రసంగం కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపింది. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, పద్మారావుగౌడ్, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశం, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, స్వామిగౌడ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, సాయి కిరణ్, గజ్జెల నగేశ్, కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అల్గునూర్‌లో బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, కరీంనగర్ మేయర్ వై సునీల్ రావు, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, జడ్పీ మాజీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ పాల్గొన్నారు.


అల్గునూర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్